

స్కిల్ పై గురి



- కలెక్టర్ కంట్రోల్‌లోకి స్కిల్ డెవలప్‌మెంటు
- డీఎస్‌డీవోల పెత్తనానికి ఇక చెక్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యాలతో ఉపాధి శిక్షణ ఇచ్చే ఏపీ స్కిల్ డెవలప్‌మెంటులో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృత్తి నైపుణ్యం సక్రమంగా లేని స్కిల్ డెవలప్‌మెంటు జిల్లా అధికారి నుంచి కింది స్థాయి కో-ఆర్డినేటర్ల వరకు ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ అంతా ఆ పార్టీ నేతల అనుచరుల చేతుల్లో గిల్లుడే అన్నట్లు నడిపారు. దీంతో జిల్లాలో పాలిటెక్నిక్, డిప్లమా, ఇంజనీరింగ్ చదివిన యువత వృత్తి నైపుణ్య శిక్షణలకు దూరమై పెద్ద సంఖ్యలో నిరుద్యోగులుగా మిగిలారు. ఇలాంటి పరిస్థితులను అంచనాలు వేసిన ప్రభుత్వం ఏపీ స్కిల్ డెవలప్‌మెంటులో నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణలపై దృష్టి సారించింది. గతంలో కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన గణేష్‌కుమార్‌ను ప్రస్తుతం ఆ సంస్థ ఎండీగా బాధ్యతలు అప్పగించారు. నాటి నుంచి స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణలు, గతంలో జరిగిన తప్పిదాలపై ఆరాతీశారు. ఇన్నాళ్లుగా స్కిల్ డెవలప్‌మెంటులో జిల్లా డీఎస్‌డీఓలు (డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంటు సంస్థ) జిల్లా అధికారుల బాధ్యతలకు చెక్ పెట్టింది. ఆ స్థానంలో కలెక్టర్ కంట్రోల్‌లో ఆ సంస్థ వృత్తి నైపుణ్య కార్యక్రమాలు జరిగేలా ప్రభుత్వం తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. అంతేకాకుండా పర్యవేక్షణ బాధ్యతలు ఎంప్లాయిమెంట్ అధికారికి అప్పగించడం చూస్తే పూర్తి స్థాయిలో ప్రభుత్వ అధికారుల కనుసన్నల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపే అవకాశముంది.

అంతా వైసీపీ మూకలే

జిల్లాలో 2017లో స్కిల్ డెవలప్‌మెంటు ప్రారంభమైంది. ఇప్పటివరకు వేలమంది నిరుద్యోగులకు శిక్షణలిచ్చింది. అప్పట్లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు సాంకేతిక విద్యకు ప్రాధాన్యతనిచ్చి శిక్షణ పొందిన నిరుద్యోగులు ఎంతో మంది అబ్రాడ్, దుబాయ్ లాంటి ఇతర దేశాల్లో ఉన్నత స్థాయిలో ఆర్థికంగా ఎదిగారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణ కార్యక్రమాలు జగన్ సర్కారులో జిల్లాలో అటకెక్కాయి. తన పాలనలో ఏకంగా జిల్లాలో 9 స్కిల్ డెవలప్‌మెంటు హబ్‌లంటూ హంగామా చేశారు. వైసీపీ మూకలున్న వ్యక్తులకు స్కిల్ లేకున్నా డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంటు అధికారిగా, పులివెందుల నేతల సిఫార్సుతో కో ఆర్డినేటర్ ఇతర సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించి అప్పట్లో వైసీపీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. దీంతో జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంటు 9 హబ్‌లు నామ్‌కే వాస్తేగా ఉద్యోగుల జీతబత్యాల కోసమే అన్నట్లు సాగిందనే విషయం జగమెరిగిన సత్యం. 2019-24 మధ్య కాలంలో సాంకేతిక, టెక్నికల్ కోర్సులకు మంగళం పాడి కేవలం టైలరింగ్, మేంధీ డిజైన్ లాంటి కోర్సులతో పది, ఇంటర్ చదివిన యువతకు శిక్షణల పేరుతో ఈ పథకాన్ని నీరుగార్చారు. దీంతో పాలిటెక్నిక్, డిప్లమా, ఇంజనీరింగ్ చదివిన యువతను శిక్షణలకు దూరం చేశారు. దీంతో జగన్ సర్కారు 5 ఏళ్ల కాలంలో యువత నిరుద్యోగ సమస్యతో సతమతమయ్యారు. గతంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంటు పథకంలో గతంలో ఎంప్లాయిమెంట్ విభాగం, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ విభాగాల్లో డీఎస్‌డీఓ నుంచి టెక్నికల్, నాన్ టెక్నికల్, డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ మేనేజరు నుంచి దాదాపు 19 మంది అధికారులు, సిబ్బంది పరిధిలో పథకం అమలయ్యేది. అయితే ఈ విధానంలో ఉద్యోగాల నియామకాల మొదలు వృత్తి నైపుణ్య కోర్సులను పరిశీలిస్తే డొల్లతనం బట్ట బయలవుతోందనే విమర్శలు లేకపోలేదు.

స్కిల్‌పై విరివిగా శిక్షణ



నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్య శిక్షణల్లో రాణించి ఆర్థికంగా స్థిరపడేందుకు స్కిల్ డెవలప్‌మెంటు అమలు బాధ్యతను కలెక్టర్ కంట్రోల్‌లో పనిచేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారికి ఇక మీదట జిల్లాలో 9హబ్‌ల పరిధిలోని యువత శిక్షణల బాధ్యతలు అప్పగించనున్నారు. ఇరువురు ఉన్నతాధికారుల పరిధిలో డీఎస్‌డీఓ, ఏజీఎం, ఏడీ న్యాక్, ప్లేస్‌మెంట్ అధికారి, జిల్లా మేనేజరు, జిల్లా నోడల్ అధికారుల పరిధిలో ఏడీ ఎస్‌డీఓ, ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్, సపోర్టింగ్ స్టాఫ్, సీడాప్, జాబ్ రీసోర్స్‌పర్సన్, గ్రామ స్థాయిలో స్కిల్ అధికారి, పీ4 పరిధిలో యూత్ ప్రొఫెషనల్స్ తో కూడిన బృందంతో కూటమి సర్కారులో స్కిల్ డెవలప్‌మెంటు యువతకు ఆర్థిక పరిపుష్టితో పటిష్ట శిక్షణలు త్వరలో ప్రారంభించనుండడం నిరుద్యోగ యువతకు శుభ పరిణామమనే చెప్పవచ్చు.

అవసరాలు తీరేవరకు యూరియా సరఫరా

- జేడీఏ చంద్రానాయక్
- జిల్లాకు 20,538 మెట్రిక్ టన్నులు మంజూరు
- అందుబాటులో మరో వెయ్యి మెట్రిక్ టన్నులు



ప్రైవేటు డీలర్ వద్ద యూరియా కోసం బారులు తీరిన అన్నదాతలు



ప్రొద్దుటూరులో సరఫరా అయిన యూరియాను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరురూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలు తీర్చేవరకు యూరియాను సరఫరా చేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలోని రైతు సేవా కేంద్రాలు, మనగ్రోమోర్, ప్రైవేటు డీలర్లకు దాదాపు 950 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. దీంతో రైతన్నలు ఆర్ఎస్‌కేల వద్ద డీలర్ దుకాణాల వద్ద బారులుతీరి యూరియాను కొనుగోలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ తీరును సమీక్షించగా పోలీసు శాఖ బందోబస్తు ప్రక్రియను చేపట్టింది. రైతులు తమ పాస్‌బుక్కులను చూపించి అవసరమైన యూరియాను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జేడీఏ చంద్రానాయక్ తాజా వివరాలను వెల్లడించారు. కడప జిల్లాకు గత ఏడాది 18,500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా ఈ ఏడాది 20,538 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని చెప్పారు. ఇందులో ఇప్పటివరకు 16,875 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరిందని, అందులో 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని చెప్పారు. మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. వీటిలో 500 మెట్రిక్ టన్నులు ఆర్ఎస్‌కేలకు, మరో 500 మెట్రిక్ టన్నులు మనగ్రోమోర్, ప్రైవేటు డీలర్లకు సరఫరా చేసినట్లు చెప్పారు. రైతులకు ఏమేరకు యూరియా అవసరమో అంతమేరకు కచ్చితంగా సరఫరా అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికి రెండు డోసుల వరకు సరిపడా యూరియాను సరఫరా చేశామని, మరో డోసు యూరియాను కచ్చితంగా అందజేస్తామని వివరించారు. డీలర్ల వద్ద, మనగ్రోమ్ సెంటర్లు, రైతు సేవాకేంద్రాలు, సొసైటీల్లో కూడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఒక ఎకరాకు 100 కేజీల యూరియా సరిపోతుందని, అంతకుమించి రైతులు వాడినా ప్రయోజనం ఉండదన్నారు. వ్యవసాయ శాఖ ప్రతి రైతన్న అవసరాన్ని కచ్చితంగా తీర్చుతుందన్నారు. సోమవారం ప్రొద్దుటూరులో ప్రైవేటు డీలర్లకు, మనగ్రోమోర్‌లలో 40.4 మెట్రిక్ టన్నుల యూరియా మండల పరిధిలోని వివిధ రైతు సేవా కేంద్రాలకు 46.8 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయింది. ఈ పంపిణీ వ్యవహారాన్ని సజావుగా సాగేలా ఏడీఏ అనిత, ఏవో వరహరికుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. టూటౌన్ సీఐ సదాశివయ్య పర్యవేక్షణలో ఎస్ఐలు, సిబ్బంది దుకాణాల వద్ద బందోబస్తు చేపట్టారు.

రేపటి నుంచి కన్యాకుమారి-పూణే ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్



కొండాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం నుంచి కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు (జయంతి ఎక్స్‌ప్రెస్) ట్రైన్ నెంబర్ 16381/ 16382)కు స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పూణే-కన్యాకుమారి మధ్య నడిచే ఈ రైలుకు కొండాపురంలో స్టాపింగ్ కల్పిస్తున్నట్లు రైల్వేశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్‌నెంబర్ 16381) కొండాపురానికి ఉదయం 11.22 కు చేరుకొని 11.23కు బయలుదేరుతుంది. పూణే ఎక్స్‌ప్రెస్ (ట్రైన్‌నెంబర్ 16382) కొండాపురానికి ఉదయం 7.29కు చేరుకొని 7.30కు బయలుదేరుతుంది. ఈ రైళ్లు జిల్లాలో కడప, ఎర్రగుంట్ల, కొండాపురం రైల్వేస్టేషన్లలో మాత్రమే ఆగుతాయి. కరోనా ముందు కొండాపురంలో స్టాపింగ్ ఉన్న ఈ రైళ్లకు, కరోనా తర్వాత స్టాపింగ్ ఎత్తివేయడంతో పలుమార్లు, ప్రజాసంఘాలు ఆందోళన చేయడంతో పాటు, ప్రజా ప్రతినిధులు రైల్వేశాఖ పై ఒత్తిడి తెచ్చారు. కాగా ఈ రైలు స్టాపింగ్‌తో కొండాపురంతో పాటు సింహాద్రిపురం, తొండూరు, ఎల్లనూరు, ముద్దనూరు మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ ఏడీకి షోకాజ్ నోటీసులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అజాద్‌వలికి షోకాజ్ నోటీసులు అందించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం జారీ చేశారు. రెండు రోజుల లోపు సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలుండాలి : కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితులకు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు పాల్గొని తమ విన్నపాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులకు సమర్పించారు. వారి సమస్యలు వింటూ, సాదక బాధలు తెలుసుకుంటూ తదుపరి చర్యలకై సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారు విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా వెళ్లి పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులో పరిష్కారాలు అందజేయాలన్నారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పొద్దనారు. అధికారులు అర్జీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం వేంపల్లి మండలం రాయిరెడ్డిపల్లి నివాసి ఓబులరెడ్డి తన భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని, సర్వే చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీకేదిన్నె మండలానికి చెందిన వితంతువు రమాదేవి తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కోరింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు

- వీసీలో కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం



సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుగా ఉన్న యూరియాను బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతి నుంచి సీఎం చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూరియా సరఫరా, ఉల్లి కొనుగోలు సంబంధితశాఖలపై సీఎస్‌కే విజయానంద్‌తో కలిసి కలెక్టర్లతో సీఎం సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతులకు ఎక్కడా యూరియా సమస్య లేకుండా చూడాలని, యూరియాను బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వచ్చే రబీ సీజన్‌కు యూరియా కొరత లేకుండా ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఉల్లి రైతులకు ఇబ్బంది లేకుండా కమలాపురం, మైదుకూరులో రెండు ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఎంకు వివరించారు. ఈ సీజన్‌లో ఉల్లి పంటలు పండించిన రైతులు మరో 10 రోజుల తరువాత పంట కోసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ వీసీలో కలెక్టర్‌తో పాటు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి

- ఎస్పీ అశోక్‌కుమార్



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 121 మంది ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి సత్వరం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

గండికోటలో డ్రోన్ కెమెరాలతో

పేకాట స్థావరాలపై దాడులు

- పోలీసుల అదుపులో 22 మంది ? • భారీగా డబ్బులు స్వాధీనం

6

6

ఆధ్యాత్మికం...ఆహ్లాదం

- పర్యాటక క్షేత్రంగా మల్లయ్యకొండ • కొండ పైన వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణం
- మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు

15 నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

- ఏపీఎస్‌పీసీ జేఏసీ నిర్ణయం



ఆర్టీపీపీలో సమావేశం అనంతరం సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఈ నెల 15 నుంచి పెద్దఎత్తున ఆందోళకు దిగుతున్నట్లు ప్రకటించింది. ఏపీఎస్‌పీఈ జేఏసీ నేతలు ఆర్టీపీపీలో సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పెద్దఎత్తున పాల్గొని రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఏకగ్రీవ తీర్మాణాన్ని ఆమోదించినట్లు జేఏసీ తెలిపింది. సెప్టెంబరు 15 నుంచి 22వరకు జరిగే ఆందోళన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర జేఏసీ విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు అందజేసిన ప్రతి పత్రాన్ని ఆర్టీపీపీ ముఖ్య ఇంజినీరుకు అందజేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చీనీ వ్యాపారాన్ని నిలిపేస్తాం

- పులివెందులలో నినదించిన చీనీ రైతులు



పులివెందుల మార్కెట్‌యార్డులో నినదిస్తున్న చీనీ రైతులు

పులివెందులరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చీనీ పంటకు మద్దతు ధర ప్రకటించకుంటే ఈ నెల 11 నుంచి చీనీ వ్యాపారం సాగనివ్వమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి, ఏళ్ల తరబడి సాగుచేసిన చీనీ పంటకు సరైన ధర లేక రైతు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. సోమవారం పులివెందుల మార్కెట్ యార్డులో చీనీరైతులు మాట్లాడుతూ గతంలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి చీనీ వ్యాపారం చేసేవారని, ఆ సమయంలో ధరలు బాగా పలికేవని, ఇక్కడి చీనీ వ్యాపారులు తామే సరుకు పంపుతామని ఢిల్లీ, చెన్నై తదితర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులను రానివ్వకుండా చేశారన్నారు. తద్వారా వ్యాపారులు సిండికేట్ అయి రైతు చీనీకాయలు తీసుకొస్తే ఒకరిద్దరు వ్యాపారులు మాత్రమే పాటలో పాల్గొంటున్నారన్నారు. దీంతో టన్ను రూ.10వేల నుంచి రూ.12 వేలలోపు ధర పలుకుతోందని, ఇతర రాష్ట్రాల వ్యాపారులకు ఇక్కడి వ్యాపారులు అధిక ధరకు అంటే రూ.20 వేలతో సరుకు అమ్ముకుంటున్నారన్నారు. వ్యాపారులు లాభ పడుతున్నారే కానీ రైతుమాత్రం సర్వనాశనం అవుతున్నా అధికారులు గాని, ప్రభుత్వంలో గాని ఎలాంటి చలనం లేదన్నారు. చీనీకి కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించలేదని, ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించాలని రైతులంతా ముక్తకంఠంతో నినదించారు.


చీనీ రైతు నష్టపోకుండా కాపాడుతాం

- అర్ధరాత్రి వ్యాపారాలు ఇక సాగవు
- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంత చీనీ రైతులను నష్టపోకుండా కాపాడుతామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొంతమంది చీనీ రైతులు, వ్యాపారులు సిండికేట్ అయి రైతులను నష్టాలపాలు చేస్తున్నారని ఆందోళనకు దిగారు. దీనిపై వెంటనే స్పందించిన బీటెక్ రవి పులివెందుల మార్కెట్ యార్డును పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల మార్కెట్ యార్డులో చీనీవ్యాపారం మార్కెట్ కంటే రూ.వెయ్యి నుంచి అధికంగానే రైతుకు దక్కుతోందన్నారు. రెండు, మూడు టన్నులు ఉన్న రైతులకు రూ.16 వేలు చెల్లిస్తే 9, 10 టన్నులు తెచ్చిన రైతులకు మాత్రం రూ.14 వేలే చెల్లిస్తున్నారని రైతులు అంటున్నారన్నా రు. తక్కువ పరిమాణంలో వచ్చిన చీనీ కాయలకు ఎక్కువ ధర కల్పించి పులివెందుల మార్కెట్‌లో ఇంత ధర చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారన్నారు. పత్రికల్లో వచ్చిన వార్తల మేరకు స్పందించి కలెక్టర్, తాను ఎప్పటికప్పుడు పులివెందుల చీనీమార్కెట్‌పై పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. నిజమైన రైతులు నష్టపోయి ఆందోళన చేస్తే తప్పులేదని, కొందరు వైసీపీ నాయకులు పనిగట్టుకొని చేస్తే పరిస్థితులు మరోలా ఉంటాయని తెలిపారు. ఇక నుంచి అర్ధరాత్రి వ్యాపారాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా ప్రభుత్వం మార్కెట్ యార్డు చైర్మన్‌గా గుణకనపల్లె అమర్ నాథ్ యాదవ్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. ఇక నుంచి ఈ మార్కెట్ యార్డుపై పర్య వేక్షణ ఉంటుందన్నారు. అనంత రం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల మార్కెట్ యార్డులో సాగుతున్న చీనీవ్యాపా రంలో ఏమైనా లొసుగులు ఉంటే సరిచేసి వ్యాపారాలు సాగేలా చేస్తామన్నారు. కార్యక్ర మంలో నూతన చైర్మన్‌గా ప్రకటించిన అమర్‌నాథ్‌యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



ఆలయం ముందు ఉన్న వ్యూ పాయింట్ నుంచి అడవుల అందాలు

వాచ్‌టవర్‌తో అడవుల రక్షణ

వాచ్‌టవర్లు పర్యాటకులు అడవులను సందర్శించడానికే కాకుండా అడవుల సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయి. వాచ్‌టవర్ పైకి ఎక్కి పరిశీలిస్తే అడవిలో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుసుకోవచ్చు. అటవీ అధికారుల పర్యవేక్షణ పెరిగి చెట్ల నరకివేత, వన్య ప్రాణుల వేట వంటివి ఆగిపోయే అవకాశం ఉంటుంది. వేసవిలో అడవుల్లో మంటలు చెలరేగితే ఆ ప్రాంతాన్ని త్వరగా గుర్తించే వీలుంటుంది. వెంటనే ఆ ప్రాంతాలకు వెళ్లి మంటలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో వాచ్‌టవర్ వద్దకు టోల్‌గేట్ ద్వారా అటవీ శాఖకు ఆదాయం సమకూర్చుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. కార్తీక సోమవారం, నూతన సంవత్సరం, మహాశివరాత్రి వంటి ప్రత్యేక రోజుల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం తదితర పట్టణాల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు కొండకు తిరుగుతుంటాయి.



గౌరమ్మకుప్ప వ్యూ పాయింట్ వద్ద నూతనంగా నిర్మించిన వాచ్‌టవర్

ఆధ్యాత్మికం... ఆహ్లాదం

- పర్యాటక క్షేత్రంగా మల్లయ్యకొండ
- కొండ పైన వాచ్‌టవర్, రెండు పగోడాల నిర్మాణం
- మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు


వాచ్‌టవర్, పగోడాలతో ఆహ్లాదం

మల్లయ్యకొండ పైన ఆలయానికి ఉత్తర దిక్కున అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడ ఎత్తయిన ప్రదేశంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓ వాచ్ టవర్‌తో పాటు రెండు పగోడాలను నిర్మించారు. గౌరమ్మ కుప్ప వద్ద నిర్మించిన వాచ్‌టవర్ నుంచి చూస్తే మల్లయ్యకొండ చుట్టూ కొన్ని వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవులు, పచ్చని చెట్లు, కొండలు, లోయలను వీక్షించవచ్చు. ఇక్కడి వ్యూ పాయింట్ నుంచి తిరుమల కొండలు కనిపిస్తాయి. దీంతో పాటు వాచ్ టవర్ పక్కనే సందర్శకులు సేద తీరడానికి వీలుగా రెండు పగోడాలను నిర్మించారు. కొండకు వచ్చిన పర్యాటకులు పగోడాల కింద కూర్చుని చల్లటి గాలుల మధ్య ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సేదతీరవచ్చు.



నూతనంగా నిర్మించిన పగోడాలు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ ఆధ్యాత్మికంతో పాటు పర్యాటక శోభ సంతరించుకుంది. జిల్లాలోనేపేరుగాంచిన పురాతన ఆధ్యాత్మిక శైవ క్షేత్రమైన మల్లయ్యకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధు, ఇనుము, మల్లయ్యకొండల్లో ప్రకృతి అందాల నడుమ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మూడు కొండల మల్లన్నగా పేరొందిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కొలువై ఉన్నాడు. మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి నిత్యం భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. సోమవారం భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. కార్తీక సోమవారాల్లో వేలాది మంది భక్తులు, మహిళలు కొండకు వచ్చి భక్తిశ్రద్ధలతో గౌరీవ్రత నోములు నోచుకుంటారు. మహిళలు ఉపవాసంతో ఆలయ ధ్వజస్తంభం ముందు కోరిన కోర్కెలు నెరవేరాలని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకుంటారు. ఏటా మూడు రోజుల పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.



వాచ్ టవర్ నుంచి కనిపిస్తున్న ప్రకృతి అందాలు




మల్లయ్యకొండ పైన దర్శించవలసిన ప్రదేశాలు

మల్లయ్యకొండపైన ఆలయానికి ఎగువ వైపున గౌరమ్మ ఆలయం ఉంది. కొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను (కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థాలు ఉన్నాయి. వీటిలో సహజంగా ఊరిన నీటిని స్వామి వారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు. స్వామి వారికి అభిషేకించిన నీటిని తీర్థంగా సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల నమ్మకం. నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం దైవ మహిమగా చెప్పుకోవచ్చు. భక్తులు నిచ్చెన ద్వారా నిచ్చెన గుండం ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు. ఇంకా వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి (ఊటచలం) తదితర దర్శించవలసిన ప్రదేశాలు కొండపైన ఉన్నాయి.

కొండ పైన ఆహ్లాదకరమైన వాతావరణం

సముద్రమట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో ఉన్న సాధు, మల్లయ్యకొండ అడవి ప్రకృతి అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు మల్లయ్యకొండ మొత్తం పచ్చదనం పరుచుకుంది. కొండపై నుంచి చూస్తే కనిపించే లోయలు, ఎత్తయిన కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, ఘాట్ మార్గంలోని మలుపులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. కొండపైన శీతాకాలంలో ఊటీని తలపిస్తూ, వేసవిలో స్వచ్ఛమైన చల్లగాలులను అందిస్తూ, వర్షాకాలంలో అరకు అందాలను మైమరపించే విధంగా కాలానికి తగ్గట్టుగా కొండ పైన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి.

కోరిన కోర్కెలు తీర్చే మల్లన్న



మల్లయ్యకొండ పైన కూటమి ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మల్లన్న స్వామి కోరిన కోర్కెలు తీరుస్తుండటంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. కొండకు వచ్చిన భక్తులు తొలుత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని తర్వాత గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం కొండ పైన వీరన్నగెవి, నిచ్చెనగుండం వంటి చూడదగ్గ ప్రదేశాలను తిలకిస్తూ ఉంటారు. కొండ పైన అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్‌టవర్, పగోడాలతో పర్యాటకులు పకృతి అందాలను తిలకిస్తూ మధురానుభూతిని పొందుతున్నారు.

-మునిరాజు, మల్లయ్యకొండ ఆలయ ఈఓ

మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు



మల్లయ్యకొండపైన పర్యాటకుల ఆహ్లాదం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వాచ్ టవర్, రెండు పగోడాల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో కొండకు వచ్చే పర్యాటకులు మంచి ఆహ్లాదం పొందుతారు. కొండపైన మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాం. కొండపైన ప్లాంటేషన్, ల్యాండ్ స్కేటింగ్, వాకింగ్ పాత్, ఉద్యానవనం పార్కు, వాచ్ టవర్, పగోడాల చుట్టూ హ్యాండ్ డ్రిల్ (స్టీల్ గ్రిల్‌తో రక్షణ గోడ)వంటి అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. సీఎస్ఆర్ నిధులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

- ఎఫ్ఆర్వో, జయప్రసాదరావు

రణభేరిని జయప్రదం చేయండి: యూటీఎఫ్



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19వ తేది వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రణభేరిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పీలేరులో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియ పూర్తై మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా మినిమం టైంస్కేల్ జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేయాల్సిన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ పేరుతో క్లస్టర్ టీచర్లుగా, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పనిచేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, మాజీ గౌరవాధ్యక్షుడు రాధాక్రిష్ణ, జిల్లా కౌన్సిలర్ వెంకటరమణ, చిన్నరెడ్డెప్ప, విజయకుమార్, పీరయ్య, ఆదినారాయణ, కామేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా రూ.4.03 లక్షలను నిరుపేద కుటుంబాలకు అందజేసినట్లు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఓ వరం అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న కత్తి సుబ్బరాయుడుకు రూ.25,166, రాగినూతల వెంకటరమణకు రూ.20,254, కొప్పర్తి యానాదయ్యకు రూ.23,752, వెంకట సుబ్బయ్యకు రూ.45,798, పెంచలయ్యానాయుడుకు రూ.79,258ల చెక్కులను పంపిణీ చేశామన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా.. సీఎం సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నారని కొనియాడారు.

31 డెంగ్యూ కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మలేరియా సబ్ యూనిట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెల వరకు 1,807 మంది రోగులకు డెంగ్యూ వ్యాధి టెస్టులు నిర్వహించినట్లు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి తెలిపారు. ఇందులో 31 మందికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయినట్లు ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా గుర్తించారని, మలేరియా సంబంధించి 3,086మంది వద్ద శ్యాంపిల్ తీసుకున్నట్లు తెలిపారు.

వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చిలకుంటలో ఓ పిచ్చి కుక్క వీరంగం చేసింది. అదే గ్రామానికి చెందిన రెడ్డెప్పనాయుడు(70) ఇంటి ముందు కూర్చుని ఉండగా, ఆయనపై దాడి చేసి గాయపరిచింది. వెంటనే స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

మట్టి తరలింపులో బురిడీ

- వ్యవసాయం పేరుతో రియల్ భూములకు
- నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అనుమతులు

కురబలకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూముల పేరుతో మట్టి తరలింపునకు అనుమతులు పొంది ఆ మట్టిని రియల్‌ఎస్టేట్ భూములకు తరలిస్తూ ఇరిగేషన్ అధికారులను బురిడీ కొట్టించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'మట్టి మాఫియా బరితెగింపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కాగా మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లె చెరువు, వ్యవసాయ భూములలో మట్టిని తోలుకోవడానికి అనుమతుల కోసం ఇరిగేషన్ అధికారులకు ఈనెల 4న ఒక యువకుడు తమ పొలంలో మట్టిని తోలుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు 85 టిప్పర్లు లేదా ట్రాక్టర్‌ల మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు కోరిన మరుసటిరోజునే ఎటువంటి విచారణ లేకుండా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేయడంలో ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదని పలువురు స్థానికులు చెబుతున్నారు. సాధారణంగా ఎవరైనా అనుమతులు కోరిన తక్షణమే మంజూరు చేయడం అసాధ్యం. దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి అనుమతులను మంజూరు చేస్తారు. అయితే కేవలం ఒక్క రోజులోనే అనుమతులు సాధించి రియల్ ఎస్టేట్ భూములకు మట్టిని తరలించుకోవడానికి అనుమతులు పొందారు. కాగా చెరువు నుంచి మట్టిని తరలించడానికి కేవలం అనుమతి పత్రంలో 5 టిప్పర్ల నెంబర్లకు అనుమతులు ఇవ్వగా మట్టిని వేసే జేసీబీ లేదా హిటాచీలను ఇందులో అనుమతులు ఇవ్వకపోవడం విశేషం. ఇవేవీ లేకుండా మట్టిని తరలించడానికి ఎలా సాధ్యమవుతుందో అంతుబట్టడం లేదు. ఈ విషయమై తహసీల్దార్ ధనంజయను వివరణ కోరగా ఇరిగేషన్ అధికారులు మంజూరు చేశారని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబును వివరణ కోరగా వ్యవసాయ భూముల అభివృద్ధి పేరుతో జాతీయ రహదారి పక్కనున్న భూములకు మట్టిని తరలిస్తున్నారని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని, దీంతో మట్టి తరలింపును నిలిపేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.



With reference to 1st cited, The Government of Andhra Pradesh had accorded permission to the farmers for excavation and transportation of silt at their own cost for non commercial purpose.

After careful examination of the representation the No Objection Certificate is hereby accorded for lifting of silt of 85 Tippers of silt with the

మట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారులు మంజూరు చేసిన లెటర్

ముగ్గురు ఐసీడీఎస్ సీడీపీవోలకు పెరిగిన 'ప్రెస్టేజీ'

- కుక్కర్ల గోల్‌మాల్ కేసులో ఎట్టకేలకు విముక్తి

కలికిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టులో సంచలనం కలిగించి పదేళ్ల పాటు చర్చనీయాంశంగా కొనసాగి అనేక మలుపులు తిరిగిన ప్రెస్టేజీ ప్రెజర్ కుక్కర్ల కొనుగోలు కేసుకు ఎట్టకేలకు సోమవారంతో తెరపడింది. ఈ కేసులో నిందితులుగా తేలిన వారిలో చివరగా మిగిలిన ముగ్గురు సీడీపీవోలకు విముక్తి కలిగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 జూలై 22న కడప ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ప్రెజర్ కుక్కర్లలో పెద్ద ఎత్తున నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఒక దినపత్రికలో 'ప్రెస్టేజీ పోయింది' శీర్షికతో ప్రచురించిన వార్త పదేళ్లపాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణితో పాటు పలువురు సీడీపీవోలను ముప్పతిప్పలు పెట్టింది. అంగన్‌వాడీలకు ప్రెస్టేజి ప్రెషర్ కుక్కర్లను సరఫరా చేయాల్సి వుండగా తక్కువ కొలతలు కలిగిన నాసిరకం బ్రాండ్లతో కుక్కర్లను సరఫరా చేశారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై పీవో, సీడీపీవోలపై జిల్లా అధికారులు పోలీసు సూపరింటెండ్‌కు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసు నమోదుకు కూడా చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా వివిధ స్థాయిల్లో జరిగిన విచారణల ఫలితంగా క్రిమినల్ కేసులను ఉపసంహరించుకున్నారు. ఆ తరువాత క్రమంలో విచారణలు, సంజాయిషీలు, చివరికి తమకేమీ తెలియదని, ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారానే సరఫరా జరిగాయని, అనంతరం నాసిరకం కుక్కర్లు సరఫరా చేసిన ప్రొద్దుటూరు ఏజెన్సీకి వాటిని తిప్పి పంపి ప్రెస్టేజీ బ్రాండెడ్ కుక్కర్లు తెప్పించామని రకరకాలుగా కొంత మంది సీడీపీవోలు మొరపెట్టుకోగా పెన్షన్‌లో ఒక శాతం కోత విధించారు. చివరి వరకూ మిగిలిని ముగ్గురు సీడీపీవోలకు కూడా ఒక శాతం పెన్షన్ కోత నుంచి కూడా ప్రభుత్వం తాజాగా విముక్తి కలిగించింది. ఎట్టకేలకు కడప సీడీపీవో వి.అరుణకుమారి, కమలాపురంలో సీడీపీవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన సి.శ్రీమంతమ్మ, సిద్ధవటం సీడీపీవో పి.భారతిలకు భారీ ఊరట లభించింది. అయితే కడప సీడీపీవో తప్పిదానికి అదనంగా దోషిగా ప్రభుత్వం నిర్ధారించడంతో ఆమెకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు నిలిచిపోయాయి. వచ్చే ఏడాది 2026 జూన్‌లో పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా తనకు విధించిన 'దోషి' (సెన్స్యూర్) శిక్ష నుంచి తప్పించాల్సిందిగా సీడీపీవో అరుణకుమారి చేసిన వినతులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి ఆమెను కూడా నిర్దోషిగా పేర్కొంటూ ఊరట కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి రెండు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

గండికోటలో డ్రోన్ కెమెరాలతో పేకాట స్థావరాలపై దాడులు

- పోలీసుల అదుపులో 22 మంది ?
- భారీగా డబ్బులు స్వాధీనం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు తెలుస్తోంది. గతంలో జమ్మలమడుగులోని గండికోట, తదితర గ్రామాల్లో పేకాట, మట్కా బాగా జరిగినట్లు సమాచారం. అయితే నూతనంగా వచ్చిన సీఐ నరేష్‌బాబు ఉన్నట్లుండి జమ్మలమడుగులో ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి పలు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అయితే పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఆదివారం సాయంత్రం పోలీసు అధికారులు వారి సిబ్బంది భారీగా పేకాట జరుగుతోందని ముందుగానే డ్రోన్ కెమెరాల ద్వారా కనిపెట్టినట్లు తెలుస్తోంది. వెంటనే అర్బన్ సీఐ నరేష్‌బాబు, వారి సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిసింది. గతంలో మైలవరం మండలం తలమంచిపట్నం పోలీసుస్టేషన్ లిమిట్స్‌లోనూ వీరు పట్టుబడినట్లు తెలుస్తోంది. అలాగే మరికొందరు గండికోటలో పేకాట నిర్వహిస్తున్నారని జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు రాబడిన సమాచారం మేరకు వెళ్లి పట్టుకున్నట్లు సమాచారం. గండికోటలో పట్టుబడిన వారు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బయటి ప్రాంతాలకు చెందిన వారని, దాదాపు 22 మంది పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి రూ.11 లక్షలు దాకా డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. గండికోటలో పేకాట స్థావరంపై దాడి చేశారా ? ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు ? డబ్బులు ఎంత స్వాధీనమైంది ? అనే విషయాన్ని జమ్మలమడుగు 'ఆంధ్రజ్యోతి' విలేకరి అర్బన్ సీఐ నరేష్‌బాబుకు ఆదివారం రాత్రి మూడుసార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. సోమవారం సాయంత్రం వరకు సమాచారం ఇవ్వలేదు. ఇదిలా ఉండగా, పారిపోయిన వారిని పట్టుకునే దాకా కేసు వివరాలు చెప్పనట్లు తెలుస్తోంది.

బస్టాప్ స్థలంపై పట్టా ఇవ్వొద్దని ఫిర్యాదు



పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ కళ్యాణికి అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతున్న బస్టాప్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు వేరొకరి పేరుతో పట్టా ఇచ్చేందుకు చర్యలు చేస్తున్నారని ఐదు గ్రామాల ప్రజలు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. పదేళ్ల నుంచి రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని తాము బస్టాప్‌గా ఉపయోగించుకుంటున్నామని, ఆ స్థలాన్ని వేరొకరికి పట్టా ఇస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. తంబళ్లపల్లె మండలంలో 15 ఏళ్ల క్రితం నిర్మించిన దబ్బలగుట్ట ప్రాజెక్టు ముంపునకు గురైన తమ భూములకు ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదని విన్నవించారు. సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పునుగుపల్లె వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరి లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ తద్వారా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఏఈలు రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, రఫీ, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 26 రేషన్ దుకాణాలపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వెంకటరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆర్గనైజేషన్ లేకపోవడంతో 6ఏ కేసులు నమోదు చేశామని వాళ్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర, అంగన్వాడీలకు సంబంధించిన పామాయిల్, కందిపప్పు, సన్నబియ్యంతో వ్యత్యాసాలు ఉన్నాయని వారు తెలిపారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను డీఆర్వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ ఎస్. లక్ష్మీపతి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఆవిష్కరించారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రాయచోటిలోని శ్రీశివ నర్సింగ్ కళాశాలలో 10వ తేది ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున తెలిపారు. ఈ మేళాలో యాక్సిస్‌బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, శ్రీషిరిడీసాయి ఎలక్ట్రికల్, కొమెట్ స్టాఫ్ సొల్యూషన్, ఎన్‌టెక్స్ ట్రాన్స్‌ఫర్మసెన్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్ఏఐపీయూఎన్‌వైఏయం. ఏపీ.జీవోవీ.ఇన్ వివరాలకు 9550104260 నెంబరును సంప్రదించాలన్నారు.

పశువులను వధించే నేరగాళ్ల అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా పశువు లను వధిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప మున్సిపల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సారకుక్కల నగేశ్, రామనపల్లెకు చెందిన నేలటూరు చంటి ఇరువురు చిన్నచౌకు ప్రాంతంలో తిరుగుతూ ఆవు ఇతర పశువులను వధిస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గత జూన్ 12న రాత్రి శంకరాపురానికి చెందిన చంద్రశేఖర్ ఆవును మేత కోసం వదలిపెట్టారు. అయితే ఆవు వెనుక భాగం సగం కట్ చేయడంతో ఆ పశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధితుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఈనెల 6న ఒక బర్రెను దేవుని కడప ప్రాంతంలో చంపి దాని అవయవాలను కోయడానికి ప్రయత్ని స్తుండడంతో ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. కొంతమంది పశువు లను వధిస్తున్నారని.. దీనిపై ప్రజల్లో అనుమానాలు కలిగి మత విధ్వంసాలకు దారి తీసే అవకాశం ఉందని... పూర్తిస్థాయిలో నిజానిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిందితుల వద్ద నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మిర్చి దిగుబడి భళా...ధర అదుర్స్

● ఎకరాకు రూ.లక్షా 30వేలు ఆదాయం

రాజుపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వర్షాకాలం పంట కింద సాగు చేసిన మిర్చి పంట అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది ఆశించిన దిగుబడులతో పాటు మార్కెట్లో మంచి ధరలు పలుకు తుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజుపాలెం మండలంలోని కొట్టాల, టంగుటూరు గ్రామాల్లో బోర్ల కింద దాదాపు వంద ఎకరాలు పైబడి ఈ పంట సాగులో ఉంది. క్రిష్ణ-604 అనేక రకం, జెర్సీ-56 అనే రకాన్ని రైతులు సాగు చేశారు.

సస్య రక్షణ చర్యలతో మంచి దిగుబడి

ఒక ఎకరా మిర్చిపంట సాగు చేసేందుకు రూ.20వేల చొప్పున మొక్క లు, ఎరువులు, సేద్యం ఖర్చులు కలిపి లక్ష రూపాయలు ఖర్చు వస్తుం దని రైతులు చెబుతున్నారు. మొక్కదశలోనే సస్యరక్షణ చేపట్ట డంతో పాటు ప్రకృతి అనుకూలించడం, వర్షాలు సకాలంలో పడడంతో మొక్క ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తోందని తెలిపారు. క్రిష్ణ 604 అనే రకం కేజీ రూ.34ధర పలుకుతుండడంతో ఇప్పటికే రెండు కోతలకు ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని తెలిపారు.

మంచి ఆదాయం వచ్చింది



ఇతను వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తన తండ్రి సాయంతో ఆరు ఎకరాలలో మిర్చి పంట సాగచేశారు. వ్యవసాయాధికారుల సూచనలు, తోటి రైతుల సలహాలతో పాటు ఏఐ టెక్నాలజీతో సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించారు. ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో ఇప్పటికే రూ.13లక్షలు రాబడి వచ్చింది. దీంతో 8 లక్షలు ఖర్చు పోయినా రూ.5లక్షలు మిగిలిందని.. ఇంకా రెండు మూడు కోతలు తెగుతాయని.. మరింత ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

-గొంగటి శ్రీనివాసులరెడ్డి, రైతు



విరగ్గాసిన మిరప కాయలు

మార్కెట్లో మంచి గిరాకీ

క్రిష్ణ 604 అనే రకం సన్నగా ఉండడంతో పాటు 10 నుంచి 15రోజులు నిల్వ ఉంటుంది. దీంతో బయట మార్కెట్‌కు తరలించి మంచి ఆదాయం పొందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అదే విధంగా జెర్సీ 56 అనే రకం మంచి దిగుబడి వస్తోందని.. లోకల్ మార్కెట్‌లో కిలో రూ.26 నుంచి రూ.29 పలుకుతోందన్నారు. ఏది మిర్చి పంట సాగు చేసిన రైతులు మంచి లాభాలు వస్తుండడంతో ఆనందంలో ఉన్నారు.

ఏటీఎం పిన్ జనరేటింగ్ పేరుతో మోసగింపు

ముద్దనూరు సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏటీఎం కార్డు పిన్ జనరేటింగ్ పేరుతో షేక్ బాబాఫక్రుద్దీన్ అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి సోమవారం ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో మోసగించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మండల పరిధిలోని యామవరం గ్రామానికి చెందిన షేక్ బాబాఫక్రుద్దీన్ భార్య తస్లీం పేరు మీద కొత్త ఏటీఎం కార్డు వచ్చింది. పిన్ జనరేటింగ్ కోసం ఎస్‌బీఐ ప్రాంగణంలో ఏటీఎం వద్దకు వచ్చాడు. ఏటీఎం కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తి పిన్ జనరేటింగ్ చేయిస్తానని నమ్మబలికాడు. దీంతో ఏటీఎం కార్డు తీసుకొని పిన్ జనరేటింగ్ చేశాడు. తిరిగి ఇచ్చే తరుణంలో వేరే ఏటీఎం కార్డు ఇచ్చాడు. తరువాత కొద్ది సేపటికి అకౌంట్‌లోని రూ.30వేలు డెబిట్ అయ్యింది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మోసగించాడని తెలుసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు కడపలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ సమావేశాల సందర్భంగా సోమవారం కడప నగరంలో హరితహోటల్ నుంచి ర్యాలీ, కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పాత బస్టాండ్‌లో బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథులుగా అఖిలభారత రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు విజుకృష్ణన్, విజయ రాఘవన్, శివదాసన్, వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణన్ మాట్లాడుతూ నేడు నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం మొత్తం దివాలా తీస్తుందని వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున వలస బాట పడుతున్నారన్నారు. సన్న, చిన్నకారు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఇవి ఏమాత్రం పట్టడం లేదని వారు ధ్వజమెత్తారు. వ్యవసాయ కూలీలను వలసలు నివారణ కోసం ఆనాడు వామపక్ష పార్టీల ఎంపీలు పెద్దఎత్తున పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నేడు బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తూట్లు పొడుస్తున్నదన్నారు. పండించిన పంటలు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేరళ తరహా ప్రత్యామ్నయ విధానాలు భారతదేశ రైతులకు వ్యవసాయ కార్మికులకు కావాలని వారు తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ కేంద్ర నిధులకు ఆశపడి రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు యూరియా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు చంద్రన్, విక్రమ్‌సింగ్, లలితబాలన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దండాల సుబ్బారావు, సీపీఎం, సీఐటీయూ, విద్యార్థి యువజన సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు నాగపవన్, అరవింద్, విజయ్‌కుమార్, రవితేజలు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 11,14 తేదీల్లో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆకాంక్షించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని భాకరాపేట ఏరియా నుంచి మైదుకూరుకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను సోమవారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 40 బస్తాల మేర రేషన్ బియ్యం బొలేరో వాహనంలో మైదుకూరుకు తరలిస్తు న్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి...కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు రైతులు తప్పని సరిగా వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు ఈ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయ న్నారు. నాలుగు నెలలు దాటిన నల్ల, తెల్ల పశువులకు రైతులు గాలి కుంటు నివారణకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ లలిత కళా విభాగం స్కాలర్ సుజాతకు స్పెయిన్ దేశ ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళావిభాగం రీసర్చ్ స్కాలర్ ఇ.సుజాతకు 2026 మే నెలలో స్పెయిన్‌లో జరగనున్న అంతర్జాతీయ సెమినార్‌కు ఆహ్వానం అందింది. సదస్సు నిర్వాహకులు ఫెర్నాం డెజ్ ఇ-మెయిల్ ద్వారా ఆమెను ఆహ్వానించారు. ఈ పర్యటనకు అయ్యే ప్రయాణ, వసతి, వీసా ఖర్చులు నిర్వాహకులు భరిస్తారని తెలిపారు. ప్రస్తుతం సుజాత, లలిత కళాశాఖ విభా గాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మార్గదర్శకత్వంలో విజయ నగర పెయింటింగ్స్ మీద పరిశోధన చేస్తున్నారు. పరిశోధనలో భాగంగా తిరుపరట్టికుంద్రం ఆలయంలోని ఉన్న జైన్ కుడ్య చిత్రాలపై రీసెర్చ్ గైడ్‌తో సంయుక్తంగా ప్రచురించిన పేపర్ ఆధారంగా నిర్వాహకులు సుజాతని ఆ సదస్సులో ప్రారంభ సమావేశంలో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారని మృత్యుంజయరావు తెలిపారు. సుజాత ఎంపిక పట్ల యూని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యా పకులు హర్షం వ్యక్తం చేశారు.

దువ్వూరులో క్లీనిక్ ల్యాబ్ సీజ్



బోర్డును తొలగిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

దువ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో సోమవారం అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లీనిక్ ల్యాబ్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. మండలంలో అనుమతులు లేకుండా ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్ ల్యాబ్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామ హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక మెడికల్ ఆఫీసర్లు సురేష్‌బాబు, హేమలత, ఎంపీహెచ్‌ఈవో రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా నదిలో ఒకరి గల్లంతు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి సమీపంలోని పెన్నానదిలో సోమవారం సాయంత్రం ఒకరు గల్లంతైనట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిసిన వివరాల మేరకు ప్రొద్దుటూరుకు చెందిన ఫయాజ్ మరో ముగ్గురితో కలిసి పెన్నానది వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. అందులో ఇద్దరు మద్యం తాగుతుండగా ఇద్దరు చేపలు పడుతున్నారు. అయితే ఫయాజ్ ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కనిపించకుండా పోయాడు. తోటివారు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. రెస్క్యూ టీం రంగంలోకి దిగింది. రాత్రి కావడంతో గల్లంతైన ఫయాజ్ ఆచూకీ లభించలేదని తెలిపారు.

సోలార్ కంపెనీలో కేబుల్ వైరు చోరీ

కొండాపురం, సెప్టెంబరు 8: మండలంలోని టి.కోడూరు వద్ద సోలార్ పనులు చేపడుతున్న సెయిల్ కంపెనీలో కేబుల్ వైరు చోరీకి గురయింది. రెండు, మూడు రోజల కిందట సుమారు రూ.3లక్షలు విలువ చేసే కేబుల్ వైరు చోరీకి గురయినట్లు సెయిల్ కంపెనీ ప్రతినిధులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల జువారి సిమెంటు ఫ్యాక్టరీ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.42వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాధనకారి రంతు



బద్వేలుటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండ లం చింతలపల్లె గ్రామానికి చెందిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాధనకారి రంతును ఏపీరోడ్డు డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సోమ వారం ఉత్తర్వులు అందాయి. తాను చేసిన సేవలను టీడీపీ ప్రభుత్వం గుర్తించి ఏపీ రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిందని రంతు తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో కృషిచేసి ఈ పదవికి వన్నెతెస్తానన్నారు.

రేపటి నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు



స్కూల్‌గేమ్స్ షెడ్యూల్ విడుదల చేస్తున్న ఏడీ రామకృష్ణ

కడప స్పోర్ట్స్ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపికల ప్రక్రియను ఈనెల 10వ తేదీ బుధవారం నుంచి వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎం.శ్రీకాంత్‌రెడ్డి, వి.చంద్రావతి వెల్లడించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంబంధిత ఏడీ రామకృష్ణ ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్‌ను అనుసరించి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో క్రీడలలో రాణించే క్రీడాకారులను ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కిరణ్ పాల్గొన్నారు.

యూఎస్ఏ జర్నల్‌కు ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) సైన్స్ పబ్లిషింగ్ గ్రూప్ నిర్వహిస్తున్న జర్నల్ ఆఫ్ ఫొటోనిక్ మెటీ రియల్స్ అండ్ టెక్నాలజీకి ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్-ఇండెక్స్, ఏడీ ఇండెక్స్ ర్యాంకింగ్, సైమాగో జర్నల్ ర్యాంకింగ్ (ఎస్‌జేఆర్), ఏఎస్సీఐ, స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్, థామ్సన్ రాయిటర్స్ ఇంపాక్ట్ ఫ్యాక్టర్ జర్నల్స్ మరియు శక్తినిల్వ, డబ్ల్యూఎల్‌ఈడీలు, లేజర్లు క్వాంటం కంప్యూటింగ్‌లలో పరిశోధనలను నిర్వహించడానికి యూజీసీ, సీఎస్ఐఆర్ ఆర్‌యుఎస్ఏ నిధులు సమకూర్చిన ఆరు పరిశోధన ప్రాజెక్టుల ఆధారంగా కమిటీ ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమిం చిందన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్ర నాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వెంకటసుబ్బయ్య, బోధనా సిబ్బంది డాక్టర్ సుధాకర్ రెడ్డిని అభినందించారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో సోమవారం చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టుపై గెలుపు సాధించింది. మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. వివరాలిలా.... ఏసీఏ క్రికెట్ స్టేడియంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగు తున్న మ్యాచ్‌లో తొలుత అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. చిత్తూరు జట్టు మొదటి రోజు 33 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. రెండవ రోజైన సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 55.3 ఓవ ర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో తేజారెడ్డి 106 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టు 31 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించి ంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లలో 142 పరుగు లకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ అచ్యు తానంద 5 వికెట్లు సాధించారు. దీంతో 111 పరుగుల స్వల్ప స్కోర్ ను ఛేదించే క్రమంలో చిత్తూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి 14.5 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 113 పరుగులు సాధించి గెలుపొందింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న క్రికెట్‌మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 43.5 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. తిరిగి రెండో రోజు బ్యాటింగ్‌కు దిగి 86.1 ఓవర్లలో 501 పరుగుల భారీ స్కోర్ వద్ద ఆలౌట్ అయింది. ఇందులో కారుణ్యప్రసాద్ 167 పరుగులు సాధించి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో నెల్లూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 33.1 ఓవర్లలో 175 పరుగులకే చేతులెత్తేసింది. కాగా బౌలింగ్ విభాగంలో నెల్లూరు జట్టు బౌలర్ అఖిల్ సాలుం 5 వికెట్లు పడగొట్టి జట్టు గెలుపునకు బాటలు వేశా రు. దీంతో ఇన్నింగ్స్ 69 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయకేతనం ఎగురవేసింది.






అచ్యుతానంద (చిత్తూరు), తేజారెడ్డి (చిత్తూరు), అఖిల్ సాలంకె (నెల్లూరు), కారుణ్యప్రసాద్ (నెల్లూరు)

అభ్యసనా వైకల్యం తొలి దశలోనే గుర్తించాలి



విద్యార్థులకు వైకల్య పరీక్షలు నిర్వహిస్తున్న శ్రీకర్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభ్యసనా వైకల్యం తొలి దశలో గుర్తిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు అని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వల్లూరు బ్రహ్మం తెలిపారు. సోమవారం కడప నగరం బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అభ్యసన వైకల్యాలు కలిగిన పిల్లలను గుర్తించి స్వీకార్ మల్టీ రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వల్లూరు బ్రహ్మం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభ్యసన వైకల్యాలను తొలిదశలోనే గుర్తించి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం వలన ఉత్తమ అభ్యసన ఫలితాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీకార్ మల్టీ రిహాబిలిటేషన్ స్టేషన్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు, పాఠశాల డైరెక్టర్ బి.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

పులివెందుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆయన టీడీపీ కార్యాలయంలో ఉండి ప్రజలు వారివారి వ్యక్తిగత సమస్యలపై వచ్చిన వారిని ఆయన కలిశారు. ప్రజలు వారి వ్యక్తిగత సమస్యలను ఆయన విన్నవించారు. అందుకు ఆయన సంబంధిత అధికారులను ఫోన్‌ల ద్వారా తెలియజేసి పరిష్కారానికి చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు

లింగాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవాలయ భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని పులివెందుల ఎండోమెంట్ ఈఓ కేవీ రమణ అన్నారు. లింగాల తహసీల్దార్ ఈశ్వరయ్యతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై అన్యాక్రాంతం అయిన దేవాలయ భూములపై చర్చించారు. ఈ సందర్భం గా ఆయ నమాట్లాడుతూ మండలం లోని లోపట్నూతల, వెలిదండ్ల, కోమన్నూ తల, తాతిరెడ్డిపల్లె, పార్నపల్లె గ్రామాలలో దేవాలయ భూములు అన్యాక్రాంతమ య్యాయని, వాటిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తామని తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Proddatur Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Mutyala Venkata Sudha W/o** Suresh Kumar Reddy residing at D.No: 11/391, Mathsya Colony, Kottapalle Panchayat, Proddatur, YSR Kadapa Dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES**:-YSR Kadapa Dist. Kadapa Registration Dist. kamalapuram Sub Dist, Yerraguntla Mandal and Nagar Panchayath and Village fields ward No.1, Proddatur road the vacant site near by the house bearinbg D.No. 1/309, Plat No. 20 is situated inSy.No. 311/2 to an extent of Ac. 01-92 cents and in Sy. No. 311/3 to an extent of Ac. 01-03 cent comprising of single plot an extent of Ac. 02-95 cents in which an extent of Ac. 0-06 cents and 146 sq. links or 297.5 sq. yards bounded as follows : EAST: 30 Feet Width Road, WEST : Others Land, NORTH: Vacant Site of Plot No. 21, SOUTH : Vacant Site of Plot No.1

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR



వేంపల్లెను మరో తురకపాలెం కానివ్వద్దు



చెత్తకుప్ప వద్ద ముక్కుమూసుకొని నిరసన తెలుపుతున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్మికులతో చర్చలు జరుపుతున్న డీఎల్‌పీఓ, ఈఓఆర్డీలు

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెను మరో తురకపాలెం కానివ్వద్దని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులు వేతనాలు ఇవ్వలేదని సమ్మెలోకి వెళ్లడంతో వేంపల్లెలో పారిశుధ్యం తీవ్ర అధ్వానంగా మారిందన్నారు. కాగా సోమవారం తులసిరెడ్డి, కాంగ్రెస్ నేతలు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులతో బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని పారిశుధ్యాన్ని పరిశీలించి దుర్గంధం వెదజల్లుతున్న చోట ముక్కుమూసుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగరాజు, వేమయ్యపాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆరు రోజులుగా పారిశుధ్య పనులకు దూరంగా ఉండడంతో వేంపల్లె పూర్తిగా చెత్తమయం అయింది. సమస్యను పరిష్కరించ లేదని, పారిశుధ్య కార్మికుల అసంతృప్తితో కడపకు తరలివెళ్లారు. గ్రీవెన్ సెల్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, డీపీఓ రాజ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా పారివుధ్య కార్మిక ప్రతినిదులు ప్రకాశం, పాలెం బాబు తదితరులు కలెక్టర్, డీపీఓలను కలిశారు. మూడు రోజుల్లో ఈఓను నియమించి వేతనాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్, డీపీఓలు తెలిపారని కార్మిక నాయకులు తెలిపారు. కాగా కార్మికులు కలెక్టర్‌ను, డీపీఓను కలిసిన నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి, వేంపల్లె ఈఓఆర్డీ రామ్మోహన్‌రెడ్డికు డీపీఓ ఫోన్ చేసి ఆదేశించారు. పారిశుధ్య కార్మికులను పిలిచి చర్చించారు. కానీ అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఈ విషయాన్ని డీపీఓ రాజ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు.

వేతనాల కోసం ఆందోళన

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె గ్రామ పంచాయతీ కార్మికులు 15 నెలల పీఎఫ్, 5,6 నెల వేతనాలు ఇవ్వలేదని, ఐదు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించు కోకపోవడం బాధాకరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ఆరోపించారు. సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహి ంచారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

వేముల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లూరు గ్రామంలో టీడీపీ నాయకుడు చంద్రవర్ధన్‌రెడ్డి తన సొంత డబ్బులతో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని స్థానిక సర్పంచుకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈ విషయాన్ని గ్రామస్థులు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన చంద్రవర్ధన్‌రెడ్డి తన సొంత డబ్బులతో వీధిలైట్లను కొనుగోలు చేసి అధికారులతో కలిసి గ్రామంలో ప్రతి పోల్‌కు ఏర్పాటుచేశారు.

డ్రగ్స్ జోలికి వెళ్లవద్దు : సీఐ

చెన్నూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌కు బానిసై నేటి యువత ఆరోగ్యం చెడిపోవడమే కాక దాని వల్ల కుటుంబాలను ఇబ్బందులు పెట్టేలా జరుగుతుందని అలాంటి వాటి జోలికి ఏ ఒక్కరూ వెళ్లకూడదని స్థానిక సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. ఈగల్‌సెల్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, అనర్థాల గురించి వివరించారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మితే 1972 నెంబరుకు కాల్ చేయాలన్నారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్, ఈగల్ సెల్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్ రాజు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు




అన్నదానకార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్‌ప్రసాద్, రక్తదానం చేస్తున్న మన్సూర్ అలీఖాన్

కడప ఎర్రముక్కపల్లె,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కడప నగరం 4వ డివిజన్ ఇన్‌చార్జియాటగిరి రాంప్రసాద్,యూనిట్ ఇన్‌చార్జి ఆవుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి కొమ్మలపాటి సురేష్,టీడీపీ నేతలు మానా చంద్రశేఖర్, పసుపులేటి వినోద్, యువనేత చక్రీ, పోలిసాయి, చింతకాలయల రఘు తదితరులు పాల్గొన్నారు.

లయన్.పి మన్సూర్ అలీఖాన్ ఆధ్వర్యంలో: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ కడప నగర ఉపాధ్యక్షుడు లయన్ పి.మన్సూర్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు రీసెంట్ జిలాని షేక్ యజ్దాన్నిబాష పలువురు పాల్గొన్నారు.


సాయిపేటలో అన్నదానం చేస్తున్న సుగవాసి పవన్‌కుమార్ తదితరులు

14న ఉచిత సామూహిక పిండ ప్రదానం

కడప కల్చరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహాలయ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు పుష్పగిరిలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ సన్నిధిలో గల రుద్రపాదం వద్ద ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, ప్రధానకార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు 2 పెద్దప్లేట్లు, 1 చెంబు, 2 గ్లాసులు, 1చిన్నప్లేటు, తీసుకురావాల్సివుంటుందన్నారు.

ఏటి గంగమ్మ గుడి నిర్మాణానికి విరాళం


రూ.10లక్షల విరాళమందిస్తున్న గుగ్గిళ్ల చాణక్య

చెన్నూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వనంవీధిలోని పెన్నానదీతీరం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఏటి గంగమ్మ గుడి నిర్మాణానికి మండల టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు గుగ్గిళ్ల చాణక్య పదిలక్షల విరాళాన్ని అందించారు. ఆయన కుమారుడు గుగ్గిళ్ల మోక్షనందన్ పుట్టినరోజు సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఈ ఆలయానికి స్థానిక రజక సంఘం సభ్యులు అడిగిన వెంటనే ఈ విరాళాన్ని ప్రకటించారు. అనంతరం కుటుంబసభ్యులు, స్థానిక రజక సంఘం సభ్యులు, టీడీపీ నేతల ఆధ్వర్యంలో కుమారుని పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రజకసంఘం సభ్యులు సూర్యం, సురేశ్, సుబ్బయ్య, బాల అంకాలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేముల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ సూచించారు. సోమవారం వేముల పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌లకు సీజనల్ వ్యాధుల గురించి సమీక్ష నిర్వహి ంచారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు దోమల వ్యాధుల ప్రమాదాలు,నివారణ పద్ధతులు, పరిశుభ్రత ప్రాముఖ్యత గురిం చి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శరణ్య, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సిబ్బందిపాల్గొన్నారు.

రక్తదానం

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ 1, 6, 12, 14 యూనిట్‌ల ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిం చారు. వందమందికి పైగా విద్యార్థులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. కడపరిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించా రు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రమేష్‌కైలాష్, కోనప్ప, అరుణ్‌కుమార్, రిమ్స్ డాక్టర్లు ఆశాదేవి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయం సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. సోమవారం 26వ డివిజన్ మాసాపేట-1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు.

ఈ-క్రాప్ తప్పకుండా చేసుకోవాలి

వేముల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తమ పంటను ఈ-క్రాప్ తప్పకుండా చేసుకోవాలని ఏవో జి.పి.ఓబులేసు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ-క్రాప్ తప్పకుండా చేసుకోవాలని రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే పంటకోత ప్రయోగాలు కూడా త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, ఏఎస్‌ఓ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర పాలక మండలి నియామకం

వేంపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన వృషభాచలేశ్వర ఆలయ కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. బోర్డు సభ్యులుగా పాలెగాని వెంకటరమణ, కేవీ మారుతి ప్రసన్న, అద్దంకి రామయ్య, నాగిశెట్టి సునిల్‌కుమార్, పెద్దరామాంజనేయులు, తప్పెట వరాలు, దాసరి రమణమ్మ, జూటూరు జ్యోతి, కొమ్మద్ది వెంకటసుబ్బమ్మ, కోనేటి రాజమ్మ, ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా ఆలయ అర్చకుడు హరిప్రవీణ్‌లను నియమిస్తూ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో ఇప్పటికే పాలెగాని వెంకటరమణను చైర్మన్ అభ్యర్థిగా అధికారపార్టీ నేతలు నిర్ణయించారు.

రైతులను సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులను సంతోషంగా ఉంచడమే ప్రభుత్వ ధ్యేయమని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. సోమవారం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నుంచి యర్రబల్లె చెరువుకు వస్తున్న కృష్ణాజలాలను బీటెక్ రవి పరిశీలించారు. ప్రస్తుతం మోట్నూతలపల్లె గ్రామం వద్దకు ఈ నీరు చేరింది. ఈ నీటిని బీటెక్ రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, రఘునాథరెడ్డి, రైతులు తదితరులుపాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పుకోసమే నమస్తే కార్యక్రమం


మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యర్థపదార్థాలు సేకరించే వారి జీవనంలో మెరుగైన మార్పు కోసమే నమస్తే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని మున్సిపల్ వరప్రసాద్, కమిషనర్ రాముడు తెలియజేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నమస్తే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ మెంబర్ శ్రీకాంత్, వైస్‌చైర్మన్ హఫీజుల్లా, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, చెత్త సేకరించే వారు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

వేముల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువు లను విక్రయించాలని దుకా ణాదారులకు అధికారులు సూచించారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాన్ని ఏఓ ఓబులేసు, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రెడ్డిలక్ష్మి తనిఖీ చేశారు. వారుమాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులకు మెరుగైన సేవలందించాలని తెలిపారు.

త్రిశూలం ఏర్పాటుపై అధికారులు సహకరించాలి


ఆర్డీఓ చిన్నయ్యకు విన్నవిస్తున్న శశిభూషణ్‌రెడ్డి

పులివెందుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వెలసిన పోలేరమ్మ ఆలయం వద్ద త్రిశూలం ఏర్పాటుకు అధికారులు సహకరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందులలోని ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రూరల్ సీఐ ఎన్వీ రమణను కలిసి విషయాన్ని చర్చించారు. 14వ తేదీ ఆదివారం త్రిశూల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హిందువులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు చైర్మన్ జోగిరెడ్డి, బీజేపీ నాయకులు భానుప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):దేశంలో యూరియా ఎమర్జెన్సీ విధించాలని, రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్.వెంకటశివ, మద్దిలేటి, వెంకటరాముడు, శంకర్‌నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి యూరియా అనర్థదాయకం

లింగాల,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు పంటలలో యూరియా ఉపయోగించాలని అవసరానికి మించి ఉపయోగిస్తే తెగుళ్ల పెరిగిపంట దిగుబడిపై ప్రభావం పడుతుందని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పట్ల రైతు సేవాకేంద్రంలో ఆయ న సోమవారం రైతులతో మాట్లాడారు. మండలంలో 33 టన్నుల యూరి యా అందుబాటులో ఉందని ఇంకా వస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఏఓ రమేష్, టెక్నికల్ ఏఓ సునిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉల్లి సాగులో జాగ్రత్తలు పాటించాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉల్లిసాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి జీవన్ తెలిపారు. మండలంలోని నా గిరెడ్డిపల్లెలో సోమవారం ఉల్లిపంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఉ ద్యాన సహాయకుడు చైతన్య రైతులు పాల్గొన్నారు.

మరమ్మతుల కారణంగా విద్యుత్ వేళల్లో మార్పులు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.వెల్లటూరు రూరల్,తువ్వ ఫీడర్ అగ్రికల్చర్‌కు ఇచ్చే సరఫరా ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,పెండ్లిమర్రి రూరల్ సప్లై 12 గంటల నుంచి ఆరు గంటల వరకు మళ్లీ తిరిగి రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇస్తామన్నారు.

నైతిక విలువలు లేని విద్య వ్యర్థం

పులివెందుల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలు లేని విద్య వ్యర్థమని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండారెడ్డి అన్నారు. సోమవారం తొండూరు మండలంలోని అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత కన్వీనర్ బివి కృష్ణారెడ్డి, సెక్రటరీ ఎంవి శేషయ్య, సభ్యులు సోమశేఖరరెడ్డి, శాశ్వత సభ్యులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. పలు తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.బాబురెడ్డి, మ్యాథ్స్ టటీచర్ రాజా, రిటైర్డ్ హెచ్‌ఎం ఇమామ్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో సైబర్ క్రైం విభాగం ఆధ్వర్యంలో సోమవారం జొమాటో డెలివరీ బాయ్స్‌కు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టరు మధుమల్లేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విస్తృతంగా జరుగుతున్నాయని ముఖ్యంగా డెలివరీ బాయ్స్ వంటి యువతను లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లువివిధ రకాలుగా మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రత్యేకంగా యూపీఐ మోసాలు, షిషింగ్ లింకులు, నకిలీ కస్టమర్స్ కాల్స్, ఓటీపీ షేరింగ్ మోసాలువంటి అంశాలపై సైబర్ క్రైం సీఐ వివరంగా అవగాహన కల్పించారు. డెలివరీబాయ్స్ తరచూ కస్టమర్లతో మమేకమయ్యే క్రమంలో వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో పలువురు డెలివరీ బాయ్స్ నేరగాళ్ల వలలో చిక్కుకుని తమ డబ్బులు కోల్పోయినట్లు పోలీసుశాఖ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఎవరూ మోసపోకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో జొమాటో డెలివరీ బాయ్స్ పాల్గొని సైబర్ నేరాల నివారణపై సూచనలను అందుకున్నారు.



అవసరమైన యూరియా సరఫరా చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని సోమవారం సీపీఐ నాయకుడు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా యూరియా కొరత తీర్చడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహ, శ్రీను, వసంతరావు, దస్తగిరి, ప్రమీళ, పీటర్, చైతన్య, మద్దిలేటి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఎరువుల కొరతపై సోమవారం బ్రహ్మంగారిమఠం మండల తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పెదుళ్లపల్లె ప్రభాకర్ మాట్లాడుతూ ఎరువుల కేటాయింపులో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు సోమిరెడ్డిపల్లె నారాయణ, రవి, ఓబులపతి నాయుడు, మల్లేశ్ పాల్గొన్నారు.

బద్వేలులో: రైతులకు సకాలంలో యూరియా అందించాలంటూ సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ యూరియా కొరత తీర్చాలని, ఎరువుల కేటాయింపులో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధిక ధరకు విక్రయించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనాలన్న షరతులు పెట్టిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహశీల్దారు ఉదయ భాస్కర్‌రాజుకు వినతిపత్రం ఇచ్చారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో సోమవారం తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ తదితరులు రైతాంగ సమస్యపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత, మందులు సక్రమంగా దొరకక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులకు సమస్యలు ఉంటే అధికారులు మాత్రం డీలర్లవైపు మాట్లాడుతూ ఎక్కడ యూరియా కొరత లేదని చెప్పడం దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగేంద్ర, సంతోష్, ధనుష్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: ఎరువుల కేటాయింపుల్లో రైతు సేవాకేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యతనివ్వాలని, సీపీఐ మండలకార్యదర్శి రవికుమార్, సహాయకార్యదర్శి కేశవ డిమాండ్ చేశారు. సోమవారం పోరుమామిళ్ల సీపీఐ నాయకులు యూరియా కొరత తీర్చాలని ఆందోళన చేశారు.

యూరియా కొరత లేదు

● రైతులకు సరిపడినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయి ● అధికారులు వెల్లడి ● ఎరువుల దుకాణాల వద్ద తప్పని రైతుల పడిగాపులు



బద్వేలులో ప్రైవేటు దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

దువ్వూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు



కొండాపురంలో పోలీసులతో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

కొండాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ రామమోహనరెడ్డి, ఏవో ఏవీరామాంజులరెడ్డిలు తెలిపారు. స్థానిక రైతుసేవాకేంద్రంలో సిబ్బందితో వారు సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని లావనూరు. టి.కోడూరు. యనమలచింతల రైతుసేవాకేంద్రాలలో ఒక్కో రైతు సేవాకేంద్రంలో ఏడు మెట్రిక్‌టన్నుల యూరియాను సోమవారం పంపిణీ చేశామన్నారు. 20.20.0.13, డీఏపీ యూరియాను రెండు, మూడు రోజుల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు ఖరీఫ్‌కు సంబంధించి ఈ-పంట నమోదు పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు డ్రిప్ పరికరాలను రైతు సేవాకేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని ఏపీఎంఐసీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మధు మల్లేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా చూడాలి

ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా చూడాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తహసీల్దార్ గురప్పకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక యూరియా బస్తా రూ.250 విక్రయించాల్సి ఉండగా బ్లాక్‌మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

బద్వేలు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మండల పరిధిలో రైతులకు అవసరమైన యూరియా కొరత లేకుండా సిద్ధంగా ఉంచినట్లు ఏవో అరుణ తెలిపారు. ఇప్పటికే 75 టన్నుల యూరియాను రైతులకందించి 15 టన్నుల మేర నిల్వ ఉంచామన్నారు. మరో వారంలోపు 20 టన్నుల యూరియా మండలానికి వస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని రాజుపాలెం, వీరబల్లె, అనంతరాజపురంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా సరఫరా చేస్తున్నారని అంతేకాకుండా మరో నలుగురు ప్రైవేటు డీలర్ల వద్ద కూడా యూరియా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు.

దువ్వూరులో: ప్రస్తుతం దువ్వూరు మండలంలోని పలు దుకాణాల్లో సోమవారం 72 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలతోపాటు మనగ్రోమోర్, పలు ప్రైవేటు అంగళ్లకు యూరియా మంజూరు కావడంతో వ్యవసాయ శాఖ, పోలీసులు, దగ్గరుండి వాటి పంపిణీకి సహకరించారు. వరి, ఇతర పంటల సాగు నేపథ్యంలో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. కొన్ని అంగళ్ల వద్ద బారులుతీరారు. మధ్యాహ్నం 12 గంటలకే పంపిణీ పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. కొందరు రైతులకు యూరియా దొరకకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.

పోరుమామిళ్లలో : మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సాగు పూర్తయ్యేంత వరకు యూరియా దాదాపు 450 టన్నులు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు మండలంలో 3500 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. వరి దాదాపు 1400 ఎకరాల్లో సాగైంది. చెరువులకు గంగనీరు వస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. మొక్కజొన్న దాదాపు 700 ఎకరాల్లో టేకూరుపేట ప్రాంతాల్లో రైతన్నలు సాగు చేశారు. జొన్న కూడా సాగు చేశారు. 300 ఎకరాల్లో మినుములు, ఉద్యానవన పంటలకు సంబంధించి డివిజనులో వెయ్యి ఎకరాల మేరకు ఉల్లిని రైతులు సాగు చేశారు. 45 రోజులు ఈ పంటలు పూర్తి స్థాయిలో రైతుల చేతికి వచ్చేంతవరకు యూరియా అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఇప్పటి వరకు 162 టన్నులు మాత్రమే వచ్చింది. ఎక్కువగా రైతు సేవాకేంద్రాల కంటే ప్రైవేటు ఫెర్టిలైజర్స్ షాపులకు మంజూరు కావడంతో రైతులు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సేవాకేంద్రాలకు కూడా ఎక్కువగా యూరియా మంజూరు చేస్తే రైతులకు ఎంతో కొంత సులువుగా ఉంటుందంటున్నారు. కాగామరో రెండు మూడురోజుల్లో 100 నుంచి 150 టన్నులు వరకు వస్తాయని అధికారులు చెబుతున్నారు

చాపాడులో: మండలంలో మొత్తం సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికి సుమారు 15 వేల ఎకరాల్లో సాగు చేశారు. వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. రైతులు యూరియా కోసం వెంపర్లాడుతున్నారు. ప్రభుత్వం మండలానికి 8.60 మెట్రిక్ టన్నులు మంజూరు చేసింది. ఇది ఎంతమాత్రం చాలడంలేదు. గ్రామసచివాలయాల్లో , ప్రైవేటు దుకాణాల్లో యూరియాను విక్రయిస్తున్నారు. ఎన్.ఓబాయపల్లె, పల్లవోలు, చాపాడు, చిన్నగురవలూరు, మరికొన్ని గ్రామాల రైతులకు ఒకసారి మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా చాలా మంది రైతులకు యూరియా అవసరం ఉంది. చిన్నగురవలూరు గ్రామంలో సోమవారం పోలీసుల బందోబస్తుతో అధికారులు యూరియాను పంపిణీ చేశారు. వరినాట్లు నాటిన తర్వాత పిలకలు గంట కట్టేందుకు యూరియా తప్పనిసరిగా వాడాల్సి ఉంది. మండల వ్యవసాయాధికారిణి దేవీపద్మలత మాట్లాడుతూ మండలంలో ఇప్పటికి 8.60 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వం సరఫరా చేయగానే రైతులకు మళ్లీ పంపిణీ చేస్తామన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు పంచాలి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి):: అమృతనగర్‌లో ఖాళీ స్థలాల ప్లాట్లు పేదలకు పంచాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాపక్షం పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు.

పారిశుధ్య పనులు తనిఖీ

కొండాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.తిమ్మాపురంలో పారిశుధ్య పనులను జడ్పీ సీఈవో ఓబుళమ్మ సోమవారం తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బందితో చెత్త సేకరణ గురించి ఆమె మాట్లాడారు. పొడి చెత్త,తడి చెత్త వేరు చేస్తున్నారా, ఎన్ని రోజులకొకసారి చెత్త సేకరిస్తున్నారు అని వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రామాంజనేయులు, ఎంపీడీవో నాగప్రసాద్ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో ఉన్న ఆల్‌డిక్సన్ కంపెనీలో ఉద్యోగాల కోసం నాగార్జున ఐటీఐ కళాశాలలో 10వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల తయారీలో ఉద్యోగాల కోసం 10, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలు ఎంతో అవసరం

కలసపాడు,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి,ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సాధనకారి రంతు పేర్కొన్నారు. సోమవారం పుల్లారెడ్డిపల్లెలో జరిగే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు.

మానవతతో కూడిన వృత్తి ఫిజియోథెరపీ

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మానవతా దృక్పథంతో కూడిన వృత్తి ఫిజియోథెరపీ అని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వీఎస్ఎం కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఫిజియోథెరపిస్టులకు ఉద్యోగావకాశాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు అసోషియేషన్ నేతలు సత్యప్రవీణ్, కృష్ణ మోహన్, మహమ్మద్ రఫీ, అలీ అక్బర్, అసీఫా,మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

కలసపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎంఈఓలు మస్తాన్‌వలి, ప్రేమ్‌సాగర్‌లు పేర్కొన్నారు. సోమవారం దూలంవారిపల్లె పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధికి నిరక్షరాస్యత అవరోధంగా మారిందన్నారు. కుటుంబంలోని సభ్యులందరు అక్షరాస్యులుగా తయారై సమాజ అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల హెచ్ఎం శివారెడ్డి, ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు,పిల్లలు పాల్గొన్నారు.

సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉందని సోమవారం రాత్రి జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు సంబంధించి వివరాలు తెలియజేశారు. శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించకూడదన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న తొమ్మిది పోలీసు స్టేషన్ల పరిధిలో జమ్మలమడుగు, పెద్దముడియం, తలమంచిపట్నం, మైలవరం, కలమల్ల, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పోలీసు స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు.

ఎంపీడీవో సేవలు మరువలేనివి

దువ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో రామకృష్ణయ్య సేవలు మరువలేనివని పలువురు ప్రశంసించారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవోకు డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పెనుగొండకు బదిలీ కావడంతో ఆత్మీయ సభ నిర్వహించారు. అనంతరం శాలువా కప్పి సన్మానంగావించారు. కార్యక్రమంలో తహసీల్దారు సంజీవరెడ్డి, మండలాధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్ చిన్నరాయుడు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షలు సాయం



చెక్కును అందిస్తున్న పాశం లక్ష్మీనరసయ్య

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టణానికి చెందిన జనసేన కార్యకర్త మద్దు సుబ్బయ్య కుటుంబానికి పార్టీ తరపున ఆ పార్టీ సీనియర్ నాయకులు పాశం లక్ష్మీనరసయ్య, గోశెట్టి చిలుంగారి క్రిష్ణమూర్తిలు రూ.5 లక్షల చెక్కును అందచేశారు. జనసేన కార్యకర్తగా ఉండే అతను ప్రమాదవశాత్తు మరణించగా అతని కుటుంబానికి సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి రూ.5 లక్షల చెక్కును సుబ్బయ్య భార్య రమణమ్మకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విశ్వేరయ్య, రామచంద్రుడు, కృష్ణయ్య, పాశం కొండయ్య తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారిమఠంలో : బ్రహ్మంగారిమఠం కొత్తబస్వాపురం గ్రామానికి చెందిన కొప్పు శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు విషయం తెలియడంతో వెంటనే వారి కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థికసాయాన్ని అందించారు. మైదు కూరు జనసేన ఇన్‌చార్జి, ఏపీఐడీసీ డైరెక్టరు పందీటి మల్హోత్ర సోమవారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు చెక్కునందించారు. కార్యక్రమంలో రవి, జయరాం, నాగరాజు, మురళి, మంగళగిరి పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు తలనీలాల వేలంపాట

పోరుమామిళ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్దిమాను గురప్పస్వామి దేవస్థానంలో ఈ నెల 10న తలనీలాల వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో రామలింగారెడ్డి తెలిపారు. వేలంపాట దక్కించుకున్నవారు 1/2వ భాగం చెల్లించి రశీదు పొందాలని, మిగిలిన మొత్తం మూడునెలల్లోపు చెల్లించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాక పనులు చేపట్టండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో సమస్యలు పరిష్కరించాకే అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. రెండు రోజుల క్రితం గండికోట ఎదురుగా లోయకు వెళ్లే దారి సిమెంటు రోడ్డు నిర్మాణానికి డోజర్‌తో పనులు చేస్తుండగా ఒక్కసారిగా గ్రామస్థులు వచ్చి అడ్డుకున్న విషయం విధితమే. అందులో భాగంగా సోమవారం గ్రామ సర్పంచ్ ఈశ్వర్, కూటమి నాయకులు, మహిళలు వచ్చి తమ సమస్యలు పరిష్కరించేదాకా గండికోటలో ఎటువంటి పనులు చేయరాదని చేస్తే తగిన ఇబ్బందులు పడుతారని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. దీంతో విషయం తెలుసుకున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి గండికోట సందర్శించారు. ఈ విషయంగా సర్పంచ్ ఈశ్వర్‌తోపాటు గ్రామస్థులు తహసీల్దార్‌ను కలిసి గండికోట పర్యాటక ప్రాంతాన్నితిలకించేందుకు వచ్చేవారి నుంచి వసూలు చేసే టోల్‌గేటులో గ్రామ పంచాయతీకి 25 శాతం నిధులు ఇస్తామని చెప్పి ఇంతవరకు సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. గండికోటలో ఇప్పటి వరకు సక్రమంగా సెల్‌టవర్లు పనిచేయవని, తాగునీటి సమస్య ఉందని, కోట ఎదురుగా కత్తుల కోనేరు ఎండిపోయిందని, కోటకు సంబంధించిన గోడలు అక్కడక్కడ రాళ్లు పడిపోయాయని తెలిపారు. గండికోటలో సమస్యలు పరిష్కరించిన తర్వాత పనులు ప్రారంభించాలని తాము అభివృద్ధికి అడ్డంకి కాదని వారన్నారు.

ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యంతోపాటు విద్యను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రాధానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఏర్పాటు చేసి సరఫరా చేసిన భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ (బిహెచ్ఎస్‌పీఎల్)అడ్వాన్స్ లైఫ్‌సేవ్ 108 వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. 108 సర్వీసు డిస్ట్రిక్ మేనేజర్ సుబ్రమణ్యం, ఆపరేటివ్ ఎగ్జిక్యూటివ్ మహేష్‌లు ఇందులో సమకూరిన ఆధునిక వసతులైన వెంటిలేటర్, లైఫ్‌సేవ్, ఆన్‌వీల్స్, పల్స్, బీపీ, ఆక్సిజన్ వంటి వసతులను వివరించారు. వాహన వసతులను పరిశీలించిన తర్వాత ఎమ్మెల్యే బీపీ చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలానికి ఒకటి, రాజుపాళెం మండలానికి ఒకటి ఈ వాహనాలను మంజూరు చేశారని చెప్పారు. ఇలాంటి సౌకర్యాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పీజీఆర్ఎస్‌కు సమస్యల వెల్లువ



ఆర్డీవో సాయిశ్రీకి సమస్యలు విన్నవిస్తున్న బాధితుడు

జమ్మలమడుగు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు సమస్యలు వెల్లువెత్తాయి. జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు ప్రాంతాల నుంచి వినతి పత్రాలు అందజేశారు. డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు, ముద్దనూరు, కొండాపురం, మైలవరం, పెద్దముడియం, తదితర మండలాల నుంచి అర్జీదారులు ఆర్డీవో సాయిశ్రీకి అర్జీలు అందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మైలవరం మండలం చిన్నవెంతుర్ల గ్రామానికి సంబంధించిన కూటమి నాయకులు ఆర్డీవోను కలిసి సమస్యలు తెలిపారు.

దేవస్థాన నూతన కమిటీ సభ్యుల నియామకం



వీరనారాయణ కమిటీ చైర్మన్

చాపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి సంబంధించిన నూతన కమిటీ సభ్యులను నియమించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా పెరుగు వీరనారాయణను నియమించారు. సభ్యులుగా వీరారెడ్డి, సి.జి.వీరారెడ్డి, పార్వతి, ఆదిలక్షుమ్మ, పావని, గురమ్మ, చెన్నమ్మ, మహేశ్వర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నరేంద్రశర్మను నియమించారు. త్వరలో వారు పాలక కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

కాశినాయన సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నర్సాపురం గ్రామానికి చెందిన మహబూబ్ పీరా కుటుంబాన్ని సోమవారం బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ పరామర్శించారు. మృతుడి తల్లి ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారాణాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఆక్సిజన్ అందించి ఉంటే మాబిడ్డ చనిపోయేవాడు కాదని మృతురాలి తల్లి బోరున విలపించింది. మృతిడి కుటుంబానికి విజయమ్మ తనప్రగాఢ సానుభూతిని తెలిజేశారు. ఈమె వెంట నర్సాపురం సొసైటీ చైర్మన్ బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ నాయకుడు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సర్పంచ్ చినఖాజావలి, టీడీపీ నాయకులు ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి,ఎల్.శ్రీనివాసులరెడ్డి,హుస్సేన్ పీరా, రోహిత్‌రెడ్డి, డి.క్రిష్ణారెడ్డి, పి.రవీంద్రా రెడ్డి, పోలిరెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు ప్రారంభిస్తాం

● దళారులను నమ్మి మోసపోవద్దు ● మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు డివిజన్‌లో పెద్ద బళ్లారి ఉల్లిగడ్డలు మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలో కొనుగోలు ప్రారంభిస్తామని మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన సూచలన మేరకు మార్క్‌ఫెడ్ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం పెద్ద బళ్లారి ఉల్లిని కొనుగోలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు.. ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు.

దివ్యాంగునికి బ్యాటరీ బండి అందజేత

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుడు దుత్తలూరు నాగరాజుకు వికలాంగుల సంక్షేమశాఖ తరఫున బ్యాటరీ ట్రై సైకిల్‌ను సంక్షేమ శాఖ అధికారి కిషోర్ అందించారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామంలో నివశిస్తున్న దుత్త లూరు నాగరాజు మూడు చక్రాల వాహనం కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవాడు. దీంతో నాగరాజు పరిస్థితిని టీడీపీ నాయకుడు పొలిమేర శివశంకర్ రెడ్డి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సంక్షేమ అధికారులతో మాట్లాడి నాగరాజుకు బ్యాటరీ ట్రై సైకిల్ అందేలా చేశారు. ఎమ్మెల్యేకు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి

బద్వేలు, సెప్టెంబరు 8, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరికీ ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు , పట్టణ కార్యదర్శి బాలు పేర్కొన్నారు. ఆమేరకు సోమవారం బద్వేలు ఆర్టీసీ డీఎం కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పోరాట సంఘం నేతలు మాట్లాడుతూ దివ్యాంగులందరికి ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం డీఎంకు వినతిపత్రం అందించారు.